దేవులపల్లి కృష్ణశాస్త్రి పాటలతో, కొండారెడ్డి ఫొటోగ్రఫీతో, చురుకుగా సాగుతున్నది. ఇప్పటికి మూడుసెట్లమీద పని ముగిసింది. ఇందులో ఎన్. టి. రామారావు, రేలంగి, జమున, జానకి, నాగభూషణం, సి. ఎస్. ఆర్., రమణారెడ్డి, డా. గోవింద రాజుల సుబ్బారావు, సూర్యకాంతం, పి. హేమలత, కె. వి. ఎస్. శర్మ, లక్ష్మీకాంతం మొదలైన వారు నటిస్తున్నారు.

* * *

శరత్ రచన "బిందుగారబ్బాయి" అనుసరించి తయారవుతున్న, అనుపమా ఫిలిమ్స్‌వారి తొలి చిత్రానికి డైరెక్టరు తిలక్, రచన తాపీ, ఆరుద్ర, సంగీతం పెండ్యాల. వీనస్ స్టూడియోలో తయారయే యీ చిత్రం ఎనిమిది రీల్సు పూర్తి అయింది. ఇందులో జమున,జగ్గయ్య,లక్ష్మీరాజ్యం,నాగయ్య, రమణారెడ్డి, కుటుంబరావు, సి. ఎస్. ఆర్., సూర్యకాంతం, పేకేటి శివరాం, మాస్టర్ వెంకటేశ్వర్ మొదలైనవారు నటిస్తున్నారు.

లలితా ఫిలిమ్స్‌వారి "చరణదాసి" 12, 13 రీల్సు పని ముగిసింది. ఈ చిత్రానికి దర్శకుడు తాతినేని, కామెరామాన్ రాయ్, కళాదర్శకుడు టి. వి. ఎస్. శర్మ, సంగీత దర్శకుడు రాజేశ్వర రావు. ఇందులో ఎ. నాగేశ్వరరావు, ఎన్. టి. రామారావు, అంజలి, సావిత్రి, జానకి, రేలంగి, సూర్యకాంతం, రమణారెడ్డి, ఎస్. వి. రంగారావు, డా. గోవిందరాజుల సుబ్బారావు, కుటుంబరావు మొదలైనవారు నటిస్తున్నారు.

* * *

జి. వి. ఎస్. (ఘంటసాల) వారి "సొంతవూరు" మే నెలలో విడుదలచేయటానికి యత్నాలు జరుగుతున్నాయి. ఇ. ఎస్. ఎన్. మూర్తి దర్శకత్వాన తయారయే ఈ చిత్రానికి ఘంటసాల సంగీత దర్శకుడు. ఈ చిత్రంలో ఎన్. టి. రామారావు, సి. ఎస్. ఆర్., పి. హేమలత, అమరనాథ్, జానకి, రాజసులోచన మొదలైనవారు నటిస్తున్నారు.

---

స్కెచ్

# ప్రేమ సుధ

వి. దక్షిణామూర్తి

ఒక యువకుడు మెల్లిగా మెట్లు ఎక్కుతూ పైకి వస్తున్నాడు. మెట్లమీదంతా చీకటిగా ఉంది. పైకివచ్చి గుమ్మం దగ్గర గోడమీద తడిమి చూశాడు. ఒక సైన్‌బోర్డు కనబడ్డది. దానిపై తనకు కావల్సిన పేరు దొరికింది. మేడపైన అంతా మసక మసకగా ఉంది.

మెల్లిగా తలుపు త్రోశాడు. సన్నని వెలుగు జీర బయటకు ప్రాకింది. ఇంతవరకూ తనకు చెప్పిన ప్రకారం జాగ్రత్తగా చూస్తున్నాడతను. అది చిన్న గది. గదిలో సామానేమీ లేదు. కాని, చదునైన ఒక టేబిలూ, తిరిగే కుర్చీ, మరో మామూలు కుర్చీ మాత్రం వున్నాయి. గోడలన్నీ బూజుకట్టి వున్నాయి. ఒక గోడలో రెండు షెల్ఫులున్నారు. వాటినిండా గాజు జాడీలూ, చిన్న సీసాలూ కనిపిస్తున్నాయి. వాటిలో కొన్ని ద్రావకాలున్నాయి.

గుండ్రని కుర్చీలో ఒక ముసలాయన పేపరు చూసుకుంటున్నాడు. యువకుడు మెల్లిగా వెళ్ళి, నమస్కారం చేసి ఒక కార్డు తీసి ఆయన కందించాడు ముసలాయన ప్రతి నమస్కారం చేశాడు.

'రండి, కూర్చోండి. మిమ్మల్ని కల్సుకున్నందుకు చాలా సంతోషంగా ఉంది." అంటూ ఆయన యువకుణ్ణి చాలా ఆప్యాయంగా పలకరించాడు.

"మీ దగ్గర ఒక విచిత్రమైన ద్రావకం ఉందని విన్నాను. అది చాలా అద్భుతమైన ఫలితాల్నిస్తుందని చెప్పారు. దాన్నిగురించి తెల్సుకుందామని మీ దగ్గర కొచ్చాను." అన్నాడు యువకుడు.

ముసలాయన ఆనందించాడు. "చూడండి, నా ద్రావకాలికి పెద్ద మార్కెట్టేమీ లేదు. ఎందుకంటారా, ఇవి అన్ని మందుల్లాంటివి కావు. జీర్ణశక్తి నభివృద్ధి చేయటానికి కాని, దంతాలు

త్వరగా మొలిపించడానికి కాని నా ఔషధాలు పనికిరావు. ఏవో సాధారణమైన గుణాల్నిచ్చే వాటిని అమ్మటం నా కిష్టంలేదు. ఏదోఒక ప్రత్యేకత వుండాలి!"

మధ్యలో యువకుడేదో మాట్లాడబోయాడు. ముసలాయన అతనికి అవకాశం యీయలేదు.

"మచ్చుకీ ద్రావకం చూడండి," లేచి షెల్ఫు నుంచి వొక సీసాతీసి. ఆయనిలా అన్నాడు. "దీనికి రంగులేదు. చూశారా, నీళ్ళల్లాగే! రమారమి వాసన లేదనే చెప్పచ్చు. కాఫీలో కాని, పాలల్లో కాని, సారాలో కాని, మరే పానీయంలో నైనా సరే దీన్ని కలిపేస్తే ఛస్తే ఆనవాలు కట్టలేం!"

"అది విషమంటారా?" చాలా భయపడిడిన వాడిలా ముఖం పెట్టాడు యువకుడు.

"దీన్ని 'గ్లవ్ క్లీనర్' అంటాను." నిర్లక్ష్యంగా అన్నాడాయన. "ఎటువంటి మరకలున్నా, చేతి గ్లవ్స్‌ని యిది శుభ్రంచేస్తుంది. రమారమి, యిది జీవితాన్నే క్షాళన చేస్తుందని చెప్పవచ్చు. అవును, జీవితాల్ని అప్పుడప్పుడు కడిగి శుభ్రం చేసుకోవడం తప్పక అవసరం."

"నాకిదక్కర్లేదు." అన్నాడు యువకుడు.

"అవచ్చు. మీరు చెప్పగలరా, దీని ధరెంత వుంటుందో? ఒక్క చెమ్చాడు ద్రావకం కంటె ఎవరికీ అవసరం వుండదు. దానికే అయిదువేలు వసూలు చేస్తాను. చిల్లికానీ తగ్గించను. మీకు ఆశ్చర్యంగా వుందా?"

"మీ మందులన్నీ యింత ప్రియమనుకోను!"

"కావు. యింత ధర 'లవ్ పోషన్,'అదే 'ప్రేమ సుధ'కి వసూలు చెయ్యడం చూడండి, భావ్యం కాదు. ప్రేమసుధ కావాల్సిన కుర్రాళ్ళదగ్గర అయిదువేలుండటం పూర్తిగా అసంభవం. అందువల్ల వాళ్ళకిది అందుబాటులో వుండటమెట్లాగా?" అన్నాడు ముసలాయన.

"నిజమే!"

"ఒకసారి కష్టమర్ని తృప్తిపరిచామంటే, మరోదానికి వాడు మనదగ్గరికే వస్తాడు. అప్పుడు మనం ధర ఎక్కువ వసూలుచేసినా అతను బాధపడడు. అవసరంవస్తే దానికోసం, కొన్నాళ్లు డబ్బు కూడ బెడతాడు."

"మీరు లవ్‌పోషన్ను నిజంగా అమ్ముతారా?"

"లేకపోతే దాని విషయం చెప్పవల్సిన అవసరం యేముందీ?" ముసలాయన మరో సీసా తీస్తూ అన్నాడు, "పైగా, ఈ సంగతులన్నీ రహస్యంగా దాచివుంచగలరని నమ్మకం కుదిర్చినవాళ్ళకే చెబుతాను."

"ద్రావకాల చర్యలవల్ల కలిగే ఫలితాలు చాల కాలంవరకూ..."

"ఆ సందేహం మీ కనవసరం. అవి శాశ్వతంగా ముమ్మాటికీ నిలబడతాయి. అనుకోకుండా హఠాత్తుగా చేసే పనులలో కూడా వీటి ప్రభావం వుంటుంది. సమృద్ధిగానూ, శాశ్వతంగానూ నిలబడే ఫలితాలు తప్పకుండా కనిపిస్తాయి."

"ఆశ్చర్యంగా ఉంది!" ఒక్కఅడుగు వెనక్కివేసి అన్నాడు యువకుడు. "చాలా అద్భుతమైన విషయం!"

"దీని శక్తిని మీరు గమనించటం అవసరం." ముసలాయన కళ్ళు పెద్దవిచేసి చెబుతున్నాడు.

యువకుడుత్సాహంగా చెవులప్పగించి వింటున్నాడు.

"అంతవరకూ మీపై నిర్లక్ష్యం చూపేవారు, ఈ ద్రావకం ప్రభావంవల్ల భక్తితో సేవిస్తారు. చీదరించుకునేవారు దాసోహం చేస్తారు! నారింజ రసంలో కానీ, మరి దేంట్లోనైనా సరే, ఒక్క బొట్టు ఈ మందు వెయ్యండి. ఒక యువతి కియ్యండి. క్షణం క్రితం ఆవిడ యెట్లావున్నా, యిది పుచ్చుకున్న వెంటనే పూర్తిగా మారిపోతుంది. ఆవిడకి ఈ ప్రపంచంలో వస్తువులింకేమీ అక్కర్లేదు. ఒక్క మీరూ, మీతో యేకాంతమూతప్ప!"

అడ్డప్రశ్న వేశాడు యువకుడు. "ఇది నేను నమ్మలేను. ఆవిడకి స్నేహితులంటే యిష్టం!"

"ఆటుపైన వాళ్ళని వదిలేస్తుంది." అన్నాడు ముసలాయన ధీమాగా. "మిగిలిన యువతులవైపు మీరెప్పుడన్నా చూస్తే ఆమె బెదిరిపోతుంది!"

"నన్ను సంశయిస్తుందా?"

"నిజంగా! తానే పూర్తిగా మీలో లీనమవాలని చూస్తుంది!"

"ఔను. ఆమెకదే యిష్టం. కాని అందుకెప్పుడూ ప్రయత్నం చేయదు!"

"చేస్తుంది. యీ మందు పుచ్చుకుంటే తప్పక ప్రయత్నిస్తుంది. మీపై శ్రద్ధ ఎక్కువగా చూపుతుంది. బ్రతికి వున్నంతకాలమూ ఆవిడ ధ్యాస యెప్పుడూ మీమీదే!"

"ఆశ్చర్యంగా వుంది!"

"మీరు చేసే ప్రతిపనినీ తెల్సుకోవాలని ఆవిడకి కుతూహలం ఎక్కువగా వుంటుంది. తెల్లవారి లేచినది మొదలు మీరు ఎక్కడెక్కడికి వెళ్ళారో ఏమేమిటి చూశారో, ఏమేమిటి చేశారో అన్నీ ఆవిడకి కావాలి. వివరాలుసహితం కావాలి. అనుకోకుండా మీకువచ్చే నవ్వుకీ, హఠాత్తుగా మీలో మీకు కలిగే విచారానికీ కూడా ఆమె కారణాలు వెలికి తీస్తుంది."

"అదీ ప్రేమంటే!" అన్నాడు యువకుడుత్సాహంగా.

"ఔను," ముసలాయనన్నాడు. "ఎంతో అప్రమత్తతతో మీ యోగక్షేమాలు కనిపెడుతూంటుంది. అసలు మిమ్మల్ని శ్రమపడనీయదు. చెడు అలవాట్లని మీదరి జేరనీయదు. వేళకి మీరు భోజనం చేయకపోతే భరించలేదు. యింటికి రావటం వొక్కగంట ఆలస్యమయితే ఆమె చాలా కంగారుపడుతుంది. హఠాత్తుగా మీకు ప్రాణాపాయం వచ్చిందేమోననీ, లేక ఎవరో మోహనాంగి మిమ్మల్ని కట్టివేసినదనీ భయపడుతుంది!"

"ప్రేమ దేవతకూడా అంత ఆప్యాయంగా ప్రవర్తిస్తుందనుకోను!" అన్నాడు యువకుడు.

"అవచ్చు. ప్రమాద వశాత్తూ ఎవతెతోనైనా మీకు పరిచయం కల్గినా, అటువంటి పరిస్థితులెవరికైనా రావచ్చుకనక, మీరు భయపడనవసరం లేదు. ఆమె మిమ్మల్ని క్షమిస్తుంది! గుండెకి గట్టి గాయమే తగిలినా, చివరికి తప్పక క్షమిస్తుంది!

"అలా జరగదులెండి!" అన్నాడు యువకుడు.

"జరగక పోవచ్చు. ఒకవేళ జరిగినా, మీకు ఫరవాలేదు. ఆమె మీకెన్నటికీ విడాకులివ్వదు. కాదు!—మిమ్మల్ని అసలు కష్టపెట్టదు. స్వల్పంగా కూడా కలతపెట్టదు!" అన్నాడు ముసలాయన విజయగర్వంతో.

యువకుడాయన తెలివికి చాలా ఆశ్చర్యపోయాడు. ఆయన మందులపై ఆసక్తి చూపాడు. "దీని ఖరీదెంతకు పెట్టారు?"

"గ్లవ్ క్లీనర్ కి వున్నంత ధరలేదు దీనికి. అదయితే, చెమ్చాడు అయిదువేలు. దమ్మిడీ తగ్గదు. ఆ ద్రావకం మీలాంటివారికి అప్పుడే అవసరం లేదు. మీకింకా వయస్సురావాలి. దానికి తగిన డబ్బు నిలవవేయద్దూ?"

"నేనడిగేది, లవ్ పోషన్ ఖరీదండీ!"

"ఓహో! అదా?" అంటూ ముసలాయన టేబిల్ సొరుగు తెరచి, ఒక చిన్న సీసా బయటకు తీసాడు. సీసా అసహ్యంగా వుంది. "దీని ఖరీదట్టేలేదు. ఒక్క రూపాయి!"

"మీకు నా కృతజ్ఞత యెట్లా చెప్పాలో తెలీటంలేదు!" అన్నాడు యువకుడు.

ముసలాయన సీసాను జాగ్రతగా నింపుతున్నాడు. యువకుడాయన్ని చూస్తూ నిలబడ్డాడు. "మీలాంటి వారికి సదభిప్రాయంవుంటే చాలు నాపైన! తక్కువ వెలగల మందులు మొదటి నా కష్టమర్స్ని ఆకర్షిస్తే, జీవితంలో బాగుపడిన పిదప, ప్రియమైన ద్రావకాలకోసం వారే వస్తారు. ఇది మీరు వాడి చూడండి. నేను చెప్పిన ఫలితాలను వెంటనే గమనించగల్గుతారు!"

"దయుంచండి. నమస్కారం." అన్నాడు యువకుడు.

"నమస్కారం!" ముసలాయన మళ్ళీ పేపర్లో మునిగాడు.

(జాన్ కాలియర్ కి కృతజ్ఞతతో)

